సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



సత్వరమే పరిష్కరించాలి
ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.
- 8లో ▸



పరిశోధనలో దేశం అగ్రగామి
పరిశోధనా రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలుస్తోందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్‌గుప్తా అన్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /23.6

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఇఫ్తార్ మంగళ: 6:35 | సహర్ బుధ: 4:45
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

తెయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని డిగ్రీ 3వ, 5వ సెమిసోటర్ పరీక్షా ఫలితాలను సోమవారం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణతో కలిసి వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిగ్రీ 5వ సెమిస్టర్‌లో మొత్తం 9,638 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,788 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో 2,869 మంది బాలికలు, 919 మంది బాలురు మొత్తం 39.30 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. డిగ్రీ 3వ సెమిస్టర్ లో 10,697 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,375 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో 2,696 మంది బాలికలు, 679 మంది బాలురు, మొత్తం 31.55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలవెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలన్నారు.

దొడ్డి కొమురయ్య అందరికీ ఆదర్శం



ఖలీల్‌వాడి : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య తదితరులు దొడ్డి కొమురయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రాములు, డీఎంహెచ్‌వో సుదర్శనం, డీపీఓ జయసుధ, డీడబ్ల్యూఓ సుధారాణి ఉన్నారు.

టైప్ రైటింగ్‌లో అస్మిత అద్వితీయ ప్రతిభ



నిజామాబాద్ నాగారం : తెలంగాణ ప్రభుత్వం 2023 జనవరి మాసంలో నిర్వహించిన టైపు రైటింగ్ పరీక్షల్లో మన జిల్లాకు చెందిన అస్మిత రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇంగ్లిష్ పేపర్–1లో 100కు 96, పేపర్–2లో కూడా 96 మార్కులు సాధించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని టైప్ రై టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో గు రువు కందకూరి రాజగోపాల చారి, శిష్యులు అస్మితను వారు ఘనంగా సత్కరించారు. న గరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న సాయి మె హర్ టైప్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి




నిజామాబాద్ అర్బన్ : ఎస్సీ వర్గీకరణ చేయకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందని నిరసిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించారు. పూలాంగ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీగా బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ చెప్పినప్పటికీ అమలు కాలేదన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యకు వినతిప త్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్, ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలు తదితరులున్నారు.



ఆర్మూర్ పట్టణంలోని బాలుర పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

కట్టుదిట్టంగా పది పరీక్ష

- తాండూరులో లీకేజీ ఘటనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు నిషేధం
- చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లకూ వర్తింపు
- ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్



నిజామాబాద్ అర్బన్ : పదో తరగతి తెలుగు పేపర్ పరీక్షను తొలిరోజు సోమవారం జిల్లాలో అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. 21,707 మంది విద్యార్థులు హాజరు కాగా, 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 138 కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరులో ప్రశ్నపత్రం లీకేజీ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్, తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 48 పరీక్ష కేంద్రలను తనిఖీ చేశాయి.138 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

నగరంలోని రవి పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజీవ్ హనుమంతు తనిఖీ చేశారు. పరీక్ష సరళిని పరిశీలించారు. విద్యార్థులు, సిబ్బంది హాజరు గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా.. స్ట్రాంగ్ రూముల నుంచి ఎన్ని గంటలకు ప్రశ్నపత్రాలు కేంద్రానికి చేరుకున్నాయి.. ఆ సమయంలో పోలీస్ ఎస్కార్టు ఉందా.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి పరిశీలించారు. సజావుగా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు సూచించారు. ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకూడదన్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. పరీక్షలు ముగిసేంతవరకు ఎంతో అప్రమత్తతో సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, పరీక్షకేంద్రంలోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు తీసుకురావొద్దని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రంలో సబ్జెక్ట్ టీచర్ కాకుండా ఇతర టీచర్లను ఇన్విజిలేటర్లుగా ఉండాలని పేర్కొన్నారు.

లోటుపాట్లు ఉండొద్దు..

పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు, వివాదాలు ఉండకూడదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ఇన్విజిలేటర్లు, పరీక్ష కేంద్రంలోని సిబ్బంది సెల్ ఫోన్లను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకూడదని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రం ఓపెన్ చేసిన తర్వాతనే బయటకు సెల్‌ఫోన్ ద్వారా ప్రశ్నపత్రాన్ని పంపిస్తున్న ఘటనలను నివారించేందుకు సెల్‌ఫోన్‌ను అనుమతించడం లేదు. ప్రతి పరీక్ష కేంద్రాన్ని ప్రత్యేక తనిఖీ బృందాలు, జిల్లా విద్యాశాఖ అధికారి, ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు కనిపిస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారి పరీక్ష అధికారులు సిబ్బందికి టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారు .



నగరంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ స్కూల్ వద్ద హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థి

పాఠశాలలకు ట్యాబ్‌లు..

- ఇక విద్యార్థుల వివరాలు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు
- సమగ్ర శిక్ష పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని 1,613 పాఠశాలలకు 1,698 సరఫరా



మోర్తాడ్ (బాల్కొండ): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సమాచారంతో పాటు వారి మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సమగ్ర శిక్ష పథకం ద్వారా ట్యాబ్‌లను పంపిణీ చేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. ఉమ్మడి జిల్లాలోని 1,613 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 1,698 ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల వివరాలను ఇది వరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పాఠశాలల నుంచి కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు వివరాలను సేకరించి ఎంఐఎస్ కో ఆర్డినేటర్ల ద్వారా మండల విద్యావనరుల కేంద్రంలో ఆన్‌లైన్ చేయిస్తున్నారు. మండలానికి సంబంధించిన విద్యార్థుల వివరాలను, మార్కుల సమాచారం నమోదు చేయడం కష్టం అవుతుండటంతో పాఠశాల స్థాయిలోనే ఆన్‌లైన్ నమోదుకు శ్రీకారం చుట్టాలని విద్యాశాఖ నిర్దేశించింది. ఇందులో భాగంగానే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఒకటి లేదా రెండు ట్యాబ్‌లను సరఫరా చేయాలని నిర్ణయించారు. ట్యాబ్‌లలో డాటా నమోదు కోసం ప్రత్యేక సిమ్ కార్డులను కూడా సమగ్ర శిక్ష పంపిణీ చేయనుంది. ట్యాబ్‌లను జిల్లా కేంద్రానికి పంపించగా పదో తరగతి పరీక్షలు ముగిసిన తరువాత మండలాల వారీగా పంపిణీ చేసే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ట్యాబ్‌లు పాఠశాలలకు అందుబాటులోకి వచ్చిన తరువాత విద్యార్థుల వివరాలను నమోదు చేయడంతో పాటు వార్షిక పరీక్షలకు సంబంధించిన మార్కులను కూడా అందులో క్రోడీకరించనున్నారు.

రెండు జిల్లాల పాఠశాలలకు పంపిణీ కానున్న ట్యాబ్‌ల సంఖ్య

జిల్లా	పీఎస్	ట్యాబ్	యూపీఎస్	ట్యాబ్	మొత్తం పాఠశాలలు	మొత్తం ట్యాబ్‌లు
నిజామాబాద్	717	751	129	145	846	896
కామారెడ్డి	642	665	125	137	767	802
మొత్తం	1,359	1,416	254	282	1,613	1,698

బార్ అండ్ బెంచ్ సమన్వయం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి : నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని పీపీ గంగారెడ్డి మెమోరియల్ హాల్‌లో 2023–24 నూతన బార్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా కక్షిదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తు తమ విధులను నిర్వహించాలన్నారు. న్యాయం కోసం న్యాయార్థులు పడే ఆరాటాన్ని అర్థం చేసుకొని వారికి సత్వర న్యాయపరమైన ప్రయోజనాలు అందేవిధంగా శ్రమిద్దామన్నారు. బార్ అండ్ బెంచ్ అనే ఒక మహోన్నతమైన రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు రాష్ట్ర బార్ కౌన్సిల్ తరపున సహాయ, సహకారాలందిస్తామన్నారు. నూతన బార్ కార్యవర్గానికి అందరి తోడ్పాటు అవసరమని బార్ అధ్యక్షుడు దేవదాసు అన్నారు.

కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు శ్రీనివాసరావు, షౌకత్ జహాన్ సిద్ధిఖీ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు సౌందర్య, భవ్య, గిరిజ, ప్రభుత్వ ప్లీడర్ శ్రీహరి ఆచార్య, ఎన్నికల అధికారులు వెంకట రమణ గౌడ్,శైలేష్ కుమార్ దేశముఖ్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి బాగి చరణ్, సహాయ సురేష్, కోశాధికారి బిట్ల రవి, లైబ్రరీ కార్యదర్శి బాలరాజ్ నాయక్, సాంస్కృతిక కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

రుద్రూర్ : సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం టాక్లీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోమవారం స్పీకర్ ప్రారంభించారు. గ్రామంలో బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహన్ని అవిష్కరించారు. అనంతరం సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. టాక్లీలో డ్రెయినేజీ సీసీ రోడ్లకు నిధులు ఇస్తానన్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, హౌసింగ్ డీఈ నాగేశ్వరరావ్, స్థానిక సర్పంచ్ విమలబాయి, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఎంపీపీ సునీత శ్రీనివాస్‌రావ్, ఎంపీటీసీ అనంత విఠల్, డీసీసీబీ డైరక్టర్ శాంతిశ్వర్ పటేల్, జెడ్పీ కోఆప్షన్ సిరాజుద్దీన్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

రుద్రూర్ : కోటగిరి మండల కేంద్రంలో నిరుపేదల ఇళ్ల కోసం స్పీకర్ పోచారం స్థల పరిశీలన చేశారు. స్థలాన్ని చదును చేస్తే 120 ఇళ్లు నిర్మించవచ్చన్నారు. ఇసుక, మొరం రవాణకు వేబిల్ ఉండాలన్నారు. ఆంజనేయ స్వామి ఆలయానికి రూ. 10 లక్షలు ఇస్తానన్నారు. బీఆర్ఎస్ సెగ్మెంట్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ఉన్నారు.

నాణ్యతకు తూట్లు..

- నిధులు వెనక్కి పోతాయనే ఉద్దేశంతో ఆదరబాదరగా అభివృద్ధి పనులు
- వేగంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- నాణ్యతపై ప్రజల్లో సందేహాలు

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి హామీ పథకం మెటీరియల్ కంపోనెంట్ కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లు ఇతర అభివృద్ధి పనులను వివిధ గ్రామాల్లో నాయకులు ఆదరబాదరగా ప్రారంభిస్తున్నారు. నిధులను సకాలంలో వినియోగించకపోతే వెనక్కి వెళ్లిపోతాయనే అనుమానంతో నాయకులు తొందరగా పనులు ముగించాలని ఆతృతపడుతున్నారు. దీంతో రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల్లో నాణ్యతపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఖర్చు చేసిన ఉపాధి హామీ నిధులను పరిగణలోకి తీ సుకుని మెటీరియల్ కంపోనెంట్ కింద రూ.57.05 కోట్ల నిధులను మంజూరు చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు నిధులను వినియోగించాలని అధికారులు మొదట సూచించారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసిపోవడం, ఏప్రిల్ ఒకటో తేది నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కావడం జరిగింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించి ఉపాధి కూలీలకు కొంత కూలీ చెల్లిస్తే పాత ఆర్థిక సంవత్సరంలోనే పనులు ప్రారంభించినట్లు ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. దీంతో సీసీ రోడ్లు, కల్వర్టులు, మురికి కాలువల నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని మేస్త్రీలపై నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ఈ పనుల్లో నాణ్యత తగ్గకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



బట్టాపూర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

గొర్రెల పంపిణీపై కదలిక

- మంత్రి తలసాని ఆదేశాలతో మొదలైన కసరత్తు
- జీవాల రవాణాకు టెండర్లు పిలిచిన పశుసంవర్ధక శాఖ
- డీడీలు కట్టిన 1,042 మంది గొల్ల,కుర్మలు
- జిల్లాకు 8,384 యూనిట్ల లక్ష్యం

ఇందూరు (నిజామాబాద్ అర్బన్) : రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. గొల్ల,కుర్మలకు జీవాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు కసరత్తును మొదలుపెట్టారు. జీవాలను ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు రవాణా చేసుకునేందుకు టెండర్లను పిలిచారు. ఎవరైతే తక్కువ రేటుకు కోట్ చేస్తారో వారికే ఈ రవాణా టెండరు దక్కనుంది. ఇందుకు నెల 11న ఉన్నతాధికారుల సమక్షంలో టెండరు సీల్ విప్పనున్నారు. టెండర్ల అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జీవాలను జిల్లాకు తీసుకురావడం, లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియను చేపట్టనున్నారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి గొర్రెలను తెచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది. అనంతరం జీవాలకు బీమాతో పాటు ట్యాగ్ స్టిక్కర్ వేయనున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో గొర్రెలు మరణిస్తే బీమా వర్తిస్తుంది.

యూనిట్లు 8,384, డీడీలు 1,042..

మొదటి విడత కింద 2017 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 19,106 మంది లబ్ధిదారులు ప్రభుత్వానికి డీడీలు చెల్లించారు. అప్పుడు 10,722 మందికి మాత్రమే గొర్రెలను పంపిణీ చేశారు. మిగతా 8,384 మందికి పంపిణీ చేయలేదు. మళ్లీ ఐదేళ్ల తర్వాత 2022 ఏడాదిలో రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది. మార్గదర్శకాలు ఇచ్చి కూడా దాదాపు ఏడు నెలలు అవుతోంది. 8,384 యూనిట్లు జిల్లాలో పంపిణీ చేయాలని లక్ష్యం ఉండగా, 1,042 మంది గొల్ల, కుర్మలు ప్రభుత్వానికి డీడీలు కట్టారు. రూ.1.25 లక్షలు ఉన్న యూనిట్ విలువను ఇప్పు డు రూ.1.75కు పెంచింది. కాగా, లబ్ధిదారుని వాట రూ.31,250 ఉంటే, రూ.43,750కి పెంచేసింది. ఒక యూనిట్‌లో 20 ఆడ గొర్రెలతో పాటు ఒక పొట్టేలు ఉంటుంది.



టెండరు ప్రక్రియ మొదలైంది

ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం జిల్లాలో రెండో విడత గొర్రెలను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా కలెక్టర్ అనుమతితో జీవాలను పక్క రాష్ట్రాల నుంచి తెప్పించడానికి రవాణా కోసం టెండర్లు పిలుస్తున్నాం. ఈ నెల 11న ప్రక్రియ ముగుస్తుంది. జీవాలు రాగానే ప్రభుత్వం మార్గదర్శల ప్రకారం డీడీలు కట్టిన వారికి పంపిణీ చేస్తాం. – వి.జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పంట ఎండుతుంటే చూడలేక..

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

మాక్లూర్ : సాగునీటిపై పాలకులు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం మాక్లూర్ మండలంలోని మూడు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు మదాపూర్ వద్ద రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గంటకు పైగా రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు రాస్తారోకో వద్దకు చేరుకుని రైతులను సముదాయించినా వారు వినలేదు. చివరకు రెవెన్యూ అధికారలు అక్కడికి వచ్చి ఖచ్చితమైన హామీ ఇవ్వడంతో రైతులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫీకి వినతిపత్రం ఇచ్చి రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పాలకులు గతంలో ఇచ్చిన హామీ శిలాఫలకాలకే పరిమితమయ్యాయని, బొంకన్‌పల్లి, ముల్లంగి(బి), గంగారమంద గ్రామాల్లో సాగునీరు అందక 800 ఎకరాల వరకు వరి ఎండిపోయే పరిస్థితి తయారైందన్నారు. 10 రోజుల్లో గుత్ప లేదా నిజాం సాగర్ నీరు అందకపోతే పంటలన్నీ ఎడిపోతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాదాపూర్ చెరువులోని నీరు వదిలి పంటలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

క్లుప్తంగా

10 నుంచి ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపా ధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి మహిళలకు మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభ మవుతుందని డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. 19 నుంచి 45 ఏళ్లు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పీజీ పరీక్షల్లో 153 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 153 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్ పరీక్షల్లో 796 మంది విద్యార్థులకు గానూ 728 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పీజీ 1వ, 5వ, 7వ సెమిస్టర్ పరీక్షలలో మొత్తం 906 మందికి గానూ 825 హాజరైనట్లు ఆమె వివరించారు. ఎల్ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులకు గానూ 26మంది పరీక్ష రాశారని తెలిపారు.

వర్సిటీకి త్వరలో నూతన అంబులెన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న అంబులెన్స్‌తో పాటు విద్యార్థుల వినతి మేరకు నూతనంగా మరో అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్న ఒక్క అంబులెన్స్ సర్వీసింగ్ వెళితే ఆ సమయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే నూతన అంబులెన్స్‌ను కొనుగోలు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి జైలు

కామారెడ్డి క్రైం: తరచూ బైక్ దొంగతనాలకు పాల్పడిన ఓ వ్యక్తికి ఎనిమిది నెలల 22 రోజుల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన మహమ్మద్ అన్వర్ కామారెడ్డిలోని ఆయా కాలనీల్లో ఐదు బైకులను చోరీ చేశాడు. పట్టణ పోలీసులు అతడిని గత ఏడాది జూలైలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ సోమవారం తీర్పు వెల్లడించారు. నిందితునికి 8 నెలల 22 రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు.

ఇందల్వాయిలో చోరీ

ఇందల్వాయి: ఇందల్వాయిలో శనివారం మధ్యాహ్నం నల్లవెల్లి గ్రామానికి చెందిన కిరాణ వ్యాపారి వేముల సంజీవ్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. సంజీవ్ అద్దెకు ఉంటున్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ప్రవేశించి రూ.1.30 లక్షల నగదు, 30 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

ఖలీల్‌వాడి: అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 78 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, నిజామాబాద్ ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతులకు రైతుబంధు రాకపోవడంతో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ ప్రతి ఏటా రైతు బంధు వచ్చిందని ఈ సంవత్సరం రైతుబంధు రాలేదని వాపోయారు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన పలువురు రోడ్డు వెడల్పులో విలువైన ఇళ్లను కోల్పోతున్నామని కలెక్టర్‌కు విన్నవించారు.


నిజామాబాద్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

పులిహోర వితరణ

ప్రజావాణికి వచ్చిన ప్రజలకు సీనియర్ సిటిజన్స్ ఫోరంఆధ్వర్యంలో పులిహోర వితరణ చేశారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా పులిహోర పంపిణీ చేశారు. ప్రతి సోమవారం దీనిని కొనసాగిస్తామని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు భూమన్న తెలిపారు. మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో మంచినీటిని సమకూర్చారు. రాజిరెడ్డి, అరుణ్ బాబు, విజయ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో 58 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 58 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 45 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు. కలెక్టర్ పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అధికారులు వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పాఠశాల స్థలంలో ప్రకృతివనం ఏర్పాటు చేయాలని వినతి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం భవానీరోడ్డులోని పాఠశాల భవనం స్థలంలో ప్రకృతి వనం ఏర్పాటు చేయాలని హమారా మిట్టి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధురాలు ఎన్ లత ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. విద్యార్థులు లేక బడి మూసివేయడంతో భవనంలో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయన్నారు.

ధరణిలో భూమి నమోదు చేయాలి

తన భూమి పట్టాపాస్ బుక్కులో నమోదు కాలేదని లింగంపేట మండలం లింగంపల్లి కుర్దుకు చెందిన గాలెం అంజయ్య ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో తనకు 14 గుంటల భూమి ఉందని, అది ధరణిలో నమోదు కాలేదని పేర్కొన్నారు.


ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ , అధికారులు

పరిశోధన రంగంలో అగ్రగామిగా దేశం

నిజామాబాద్‌అర్బన్: పరిశోధన రంగంలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ రవీందర్ అన్నారు. సోమవారం గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం విభాగంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ పరిశోధనాలపై విద్యార్థులు శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే తెలంగాణ యూనివర్సిటీ పరిశోధనాలు ఎంతో పేరు సంపాదించాయన్నారు.అనంతరం ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ బి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలను ప్రోత్సహించే దిశగా ఐసీఎస్ఎస్ఆర్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ 75 ఏళ్లలో భారతదేశం ఆహార కొరత నుంచి సుస్థిరాభివృద్ధి సాధించిందన్నారు. సదస్సులో రవీందర్ రెడ్డి, పున్నయ్య ప్రసంగించారు.


మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్

వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆదేప్ప, వేణుప్రసాద్, భరద్వాజ్ సురేష్, లక్ష్మీనారాయణ, యూజీసీ కో ఆర్డినేటర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి క్రైం: గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయిని ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. అశోక్ నగర్ కాలనీకి చెందిన పృథ్వీ, టేక్రియాల్ గ్రామానికి చెందిన శివ అనే యువకులు మహారాష్ట్రలోని ఉమ్రి ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి ప్యాకెట్ల రూపంలో కామారెడ్డిలోని యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 10 గంజాయి ప్యాకెట్లు దొరికాయి. కామారెడ్డి తహసీల్దార్ వెంకటరావు సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితులను రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తి చెంది ఇద్దరు, మద్యానికి బానిసై ఒకరు, మరో కారణంతో వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డారు.

రాజంపేట: ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. సిద్దాపూర్ గ్రామానికి చెందిన పట్నం సిద్దరాములు(60) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఉదయం ఆయన గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కూతురు వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


సిద్దరాములు (ఫైల్)

ఖాజాపూర్‌లో ఒకరు..

బోధన్‌రూరల్: సాలూర మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన చింతం మారయ్య (42) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు.. మారయ్య కొంతకాలం నుంచి మద్యానికి బానిసై పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మారయ్య (ఫైల్)

జీవితంపై విరక్తి చెంది..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్ శివారులో సోమవారం గ్రామానికి చెందిన తోట హన్మండ్లు(58) సెల్ టవర్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హన్మండ్లు కొంతకాలంగా మానసి స్థితి సరిగ్గా లేక అనారోగ్యంతో బాధపడుతున్నాడు జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య వితవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.


హన్మండ్లు మృతదేహం

నస్రుల్లాబాద్‌లో ఒకరు..

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన ఉల్లెంగ సాయిలు (48) జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సాయిలుకు గతంలో రెండు పెళ్లిలు జరగ్గా విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి భార్య పిల్లలు లేరని బాధపడేవాడు. ఇటీవల ఆయన చేయి విరిగింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన సాయిలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తమ్ముడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.


సాయిలు(ఫైల్)

ఏడు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో వ్యవసాయ క్షేత్రాల వద్ద గలఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ తీగలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగ, ఆయిల్‌ను చోరీ చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మెండోరా పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులు ఫిర్యాదు చేశారు.

రైతుల ఆందోళన

ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయిన ప్రదేశంలో గతంలో మూడింటిని ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాకతీయ కాలువకు అమర్చిన మోటార్లను కూడా ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురి కాకుండా ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న అధికారులు

మత్తులో కత్తితో వీరంగం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బ ప్రాంతంలో గంజాయి, మద్యం మత్తులో ఖలీమ్ అనే వ్యక్తి కత్తితో ఆదివారం రాత్రి వీరంగం చేశాడు. ఖలీమ్ భార్య మహారాష్ట్రకు వెళ్లిపోవడంతో తన భార్య కావాలని రోడ్డుపై కత్తితో తిరగడంతో తన స్నేహితుడైన భాస్కర్ ఆపేందుకు యత్నించారు. ఖలీల్ కత్తితో తిరగడంతో స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఖలీమ్, భాస్కర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామ సమీపంలో ఓమ్నీ వ్యాన్ పొలాల్లోకి దూసుకెళ్లింది. ధర్పల్లికి చెందిన విష్ణు కొండూర్ గ్రామంలో బీడీ కార్ఖానా నడిపిస్తున్నాడు. కార్ఖానాలో కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణ వ్రతం చేశాడు. పూజ పూర్తయిన అనంతరం కుటుంబ సభ్యులను ధర్పల్లిలో వదిలేసి బీడీలు ఎంచుకోవడానికి తిరిగి కొండూర్ వస్తుండగా ఓమ్నీ వ్యాను పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విష్ణుకు ఎలాంటి గాయాలు కాలేదు.



ఖజానాకు తాళం!

- ఫ్రీజింగ్‌తో ఆగిపోతున్న బిల్లులు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న నేతలు, కాంట్రాక్టర్లు

బాన్సువాడ: ఖజానాకు ఫ్రీజింగ్ జబ్బు పట్టుకుంది. నెలలు తరబడి ఇదే పరిస్థితి నెలకొనడంతో కాంట్రాక్టర్లు, ఇతర అభివృద్ధి పనులు చేసిన వారు బిల్లుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రెజరీల చుట్టు తిరుగుతున్నారు. ప్రస్తుతం ట్రెజరీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. కార్మికుల జీతాలు, ఇతరత్రా చిన్న, చిన్న బిల్లులు మినహా మిగతా బిల్లులు పాసవ్వడం లేదు. గతంలో కొన్ని సందర్భాల్లో సర్కారు ఖజానాకు నేరుగా ఫ్రీజింగ్ అని వచ్చేది. ఇప్పుడు ఫ్రీజింగ్‌లో అధికారులు బిల్లులు చేసి పంపిన తర్వాత సుమారు మూడు నెలల అనంతరం పాసవుతున్నాయి. వెబ్‌సైట్‌లో పరిశీలిస్తే వెయింటింగ్ ఫర్ గవర్నమెంట్ అప్రూవల్ అని వస్తుందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనులకు సంబంధించిన కుప్పలు తెప్పలుగా ఎస్టీవోలో పేరుకుపోతున్నాయని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. కొన్ని సందర్భాల్లో మాత్రం ట్రెజరీలపై ఒత్తిడి లేకుండా బిల్లులు మాత్రం చేసి ఆప్‌లోడ్‌చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. తమ వద్ద పెండింగ్‌లో లేదని స్పష్టం చేస్తున్నారు. బిల్లులు చేసినా బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా కావటం లేదని, దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు ఇచ్చేదే తక్కువ నిధులని, వాటితో అరకొర పనులు చేస్తే ఆ బిల్లులు కూడా సకాలంలో రాకపోతే ఎలా అని బాన్సువాడ మండలానికి చెందిన ఓ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.


బాన్సువాడ ట్రెజరీ కార్యాలయం

మెజారిటీ బిల్లులది ఇదే పరిస్థితి

మెజారిటీ బిల్లులు ఫ్రీజింగ్ సమస్యతో పాస్ కావడం లేదు. ఒకటి రెండు మినహా అన్ని రకాల ఖాతాలది ఇదే పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నిధులు, జీపీ జనరల్, స్టేట్ ఫైనాన్స్ తదితర అన్ని రకాల నిధులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ట్రాక్టర్ల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సీసీ రోడ్లు, మధ్యాహ్న భోజనం బిల్లులు, హాస్టళ్ల బిల్లులు, జీపీఎఫ్ లోన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, తదితర అన్ని రకాల బిల్లులు నెలల తరబడి మూలుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు మాత్రం కొంతమేర తొందరగా విడుదల అవుతున్నాయి. ఖాతాల ఫ్రీజింగ్‌తో అధికార పక్షానికి చెందిన నేతలు లోలోపల మదన పడుతున్నారు. ఒక్క బాన్సువాడ ట్రెజరిలోనే 5027 బిల్లులకు గాను రూ.94.46 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాలో బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, మద్నూర్ ట్రెజరీల్లో సుమారుగా రూ.250 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

కేంద్రం నుంచి నేరుగా జీపీలకు..

ఇటీవల తాము జీపీలకు ఇచ్చిన నిధులు సైతం రాష్ట్ర ప్రభుత్వం వినియోగించకుంటోందని కేంద్ర సర్కారు ఆరోపిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీపీల పేరుతో ప్రత్యేకంగా ఖాతాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 70 శాతం పైగా పంచాయితీలు సర్పంచు, ఉపసర్పంచు పేరుతో అకౌంట్లు తెరిచాయి. దీంతో కేంద్రం నిధులు ఇకపై నేరుగా ఖాతాల్లో జమకానున్నాయి. ఈ ప్రక్రియ ద్వారా కేంద్రం నిధులను నేరుగా ఖర్చు చేసుకునేందుకు జీపీలకు వెసులుబాటు కలగనుంది.

ఏరియల్ బిల్లులు రావడం లేదు

గత ఏడాది నవంబర్‌లో ఏరియల్ బిల్లులు పంపిస్తే ఇప్పటి వరకు రాలేవు. 15 నెలలుగా ఏరియల్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. ప్రభుత్వం ఏరియల్ బిల్లులు విడుదల చేయాలి.

– భూపతి, టౌన్‌ప్లానింగ్ అధికారి

ప్రభుత్వం నుంచే పెండింగ్ ఉన్నాయి

ట్రెజరిలో బిల్లులు పెండింగ్‌లో ఏమి లేవు. మేము బిల్లులు చేసి పంపినాం. ప్రభుత్వం నుంచే పెండింగ్ అని చూపుతుంది. బాన్సువాడ ట్రెజరి పరిధిలో రూ.94.46 కోట్ల బిల్లులు రావాలి. కొన్ని బిల్లులు రెండు, మూడు రోజుల్లో విడుదల అయ్యే అవకాశం ఉంది. – జగన్, ఏసీటీవో బాన్సువాడ

ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి క్రైం: ఫిట్స్ రావడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే ప్లాట్‌ఫాంపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రెండో ప్లాట్‌ఫాంపై పడిపోయి ఉన్నట్లు తెలియడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదు. ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎవరైనా అతడిని గుర్తు పడితే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై తావూనాయక్ కోరారు.



కెనాల్‌లో పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ శివారులో డెయిరీ ఫారం దగ్గర నిజాంసాగర్ కెనాల్‌లో పడి గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రెండో వివాహం కోసమే..

- బాలుడిని హతమార్చిన తల్లి
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

మాక్లూర్: కొడుకును హత్య చేసి పారిపోయిన నిందితురాలు గడ్డం లావణ్యను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని సాయినగర్ (ఇందిరాపురం) కాలనీకి చెందిన లావణ్య మార్చి 28 తెల్లవారుజామున మండలంలోని దాస్‌నగర్ శివారు నిజాంసాగర్ కాలువ వద్ద ఆరేళ్ల కుమారుడు రోహిత్‌ను గొంతు నులిమి హత్య చేసిన విషయం తెలిసిందే.. విచారణలో భాగంగా సోమవారం నగరంలోని పోస్టు ఆఫీస్ వద్ద నిందితురాలు లావణ్యను అదుపులోనికి తీసుకొన్నట్లు ఎస్సై తెలిపారు. రెండో వివాహం చేసుకోవటానికి సిద్ధపడి ఈ హత్య చేసినట్లు లావణ్య తమ విచారణలో వెల్లడించిందన్నారు. చేస్తున్న తప్పుడు పనులపై తరుచూ భర్త భరత్ ప్రశ్నించడంతో అతడికి విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకోవటానికి సిద్ధమైందన్నారు. కుమారుడు రోహిత్‌ను ముందుగా అడ్డు తొలగించుకొని ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో మార్చి 28న నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోహిత్‌తో కలిసి ఆటోలో దాస్‌నగర్‌లో వెళ్లింది. అక్కడి నుంచి కాల్వ గట్టుపై కొద్ది దూరం వరకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్యచేసి కాలువలో పారేసినట్లు నిందితురాలు విచారణలో అంగీకరించిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామం చెరువులో చేపల వేటకు వెళ్లి నీల యాదగిరి(46) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్మూర్‌లోని పోచమ్మ గల్లీకి చెందిన యాదగిరి కూలీ పని చేస్తూనే చేపలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి లాగానే ఆదివారం సాయంత్రం పిప్రి గ్రామంలోని చెరువులో చేపలను వేటాడుతూ ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి చెరువులో పడిపోయాడు. చెరువు లోతు ఎక్కువగా ఉండడం, యాదగిరి కాళ్లకు చేపల వల చిక్కుకు పోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కర్రోల్ల ప్రమోద్ కుమార్ (26) సోమవారం వేకువజామున మెదక్ పట్టణంలో జరిగిన రోడ్డుప్ర మాదంలో మృతి చెందాడు. ప్రమోద్‌కుమార్ మెద క్ జిల్లా గాంధారిపల్లి నుంచి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై తన స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా ఆయ న మెదక్ చేరుకోగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రమోద్‌కుమార్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన అక్కడి పెట్రోలింగ్ పోలీ సులు యువకుడిని చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.


ప్రమోద్(ఫైల్)

జారి పడి హమాలీ..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాదిలో గల సంతోష్‌రెడ్డి రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన చౌదరీ సంతోష్(34) ధాన్యం సంచుల లాట్ పైనుంచి జారీపడి మృతి చెందాడు. వివరాలు.. సంతోష్‌తోపాటు మరికొంత మంది బీహారీ కూలీలు ఏడాది కాలంగా రైస్‌మిల్లులో పనిచేస్తున్నారు. వీరిలో సంతోష్ కొంతకాలంగా మద్యానికి బానిసై సరిగా పనిచేయకుండా తిరుగుతున్నాడు. తాగిన మత్తులో ధాన్యం బస్తాల లాట్‌పై ఎక్కినప్పుడు ప్రమాదవశాత్తు జారి పడటంతో ముక్కుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. మృతుడి బంధువు రాజేష్‌రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

దోమకొండ: దోమకొండకు చెందిన కామినేని ధీరజ్(37) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన ధీరజ్ సోమవారం ఉదయం గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల కల్లు కంపౌండ్‌లో శవమై కనిపించాడు. మద్యం తాగడంతో మృతిచెందాడా లేక ఇతర వ్యక్తులతో గొడవ వల్ల మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. కాగా మద్యం తాగించి హత్య చేసి ఉంటారని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి సోదరుడు సుధీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.


ధీరజ్(ఫైల్)